సాక్షి కర్నూలు
గురువారం । 14 । నవంబర్ । 2024



తగ్గిన ఉల్లి ధర

కర్నూలు(అగ్రికల్చర్): మార్కెట్‌లో ఉల్లిధర తగ్గుతో వస్తోంది. బుధవారం మార్కెట్‌కు 10,749 క్వింటాళ్ల ఉల్లి రాగా క్వింటా గరిష్టంగా రూ.4,444 ధర పలికింది.



కార్తీక దీపారాధన

శ్రీశైలంటెంపుల్: కార్తీక మాసోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం శ్రీశైల మహాక్షేత్రంలో భక్తులు దీపారాధన చేశారు. దేవస్థానం అధికారులు ఆకాశ దీపాన్ని వెలిగించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,631.52
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:99.898
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:3,971
అవుట్ ఫ్లో	:10,062

న్యూస్‌రీల్

యూపీహెచ్‌సీ తనిఖీ చేసిన కేంద్ర బృందం



సేవలు ఆరా తీస్తున్న కేంద్ర బృందం సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని గడ్డ వీధిలోని యూపీహెచ్‌సీని నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (జాతీయ నాణ్యతా ప్రమాణాల వైద్య బృందం) సభ్యులు డాక్టర్ సీమ మురళి, డాక్టర్ దీపక్ నాందేవ్ డొంగ్రే తనిఖీ చేశారు. అక్కడి వైద్యసేవలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యానికి సంబంధించి వివిధ రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. గర్భిణీలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, రక్త పరీక్షలు, మాతా శిశు సంక్షేమం, ఆరోగ్య విద్య, చిన్నారుల ఆరోగ్యసేవలు, టీకాలు, ప్రయోగశాల, మందుల నిర్వహణ, అసంక్రమిత వ్యాధులైన రక్తపోటు, షుగర్ లాంటి వాటికి సంబంధించిన వివరాలు, సాధారణ పరిపాలన తదితర అంశాల గురించి నిశితంగా పరిశీలన చేశారు. వీరి వెంట డీపీఎంఓ డాక్టర్ ఉమా, డీపీఓ విజయరాజు, వైద్యాధికారి డాక్టర్ సాత్విక, కన్సల్టెంట్ ముర్తుజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు ఎస్పీగా హుస్సేన్ పీరా

కర్నూలు (టౌన్): జిల్లా అదనపు ఎస్పీగా జి. హుస్సేన్ పీరా నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 మంది అదనపు ఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న హుస్సేన్ పీరాను కర్నూలు అదనపు ఎస్పీగా బదిలీ చేశారు.

నేడు రాష్ట్ర స్థాయి ఇంటర్ స్కూల్ బ్యాండ్ పోటీలు

కర్నూలు సిటీ: సమగ్ర శిక్ష, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర స్థాయి ఇంటర్ స్కూల్ బ్యాండ్ పోటీలు నిర్వహించనున్నారు. స్థానిక మాంటిస్సోరి ఇండస్ స్కూల్‌లో నిర్వహించే ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 300 మందికిపైగా విద్యార్థులు పాల్గొనున్నారు. సమగ్ర శిక్ష రాష్ట్ర సంచాలకులు బి.శ్రీనివాసరావు, కలెక్టర్ పి.రంజిత్ బాష, పాఠశాల విద్య ఆర్జేడీ కె.శామ్యూల్, కర్నూలు, నంద్యాల డీఈఓలు ఎస్.శ్యామూల్ పాల్, పి.జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శి భానుమూర్తి రాజు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. పోటీల్లో గెలుపొందిన స్కూల్ బ్యాండ్ బృందాలు కర్ణాటక రాష్ట్రంలోని దావనగెరెలో జరిగే సౌత్ జోన్ పోటీల్లో పాల్గొంటాయని అధికారులు వెల్లడించారు.

విద్యార్థినిపై అత్యాచార యత్నం

- ముగ్గురిపై పోక్సో చట్టం కేసు నమోదు

కర్నూలు: కోసిగి మండలం కడదొడ్డి గ్రామంలో 8వ తరగతి విద్యార్థినిపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి అత్యాచారయత్నం చేశాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు.. కడదొడ్డికి గ్రామానికి చెందిన దంపతులు తమ కుమారుడితో కలిసి బతుకుదెరువు కోసం రెండు నెలల క్రితం కర్ణాటక రాష్ట్రానికి వలస వెళ్లారు. 8వ తరగతి చదువుతున్న తమ బిడ్డను తాత వద్ద వదిలి వెళ్లారు. గత నెల 30న రాత్రి బాలిక ఇంటి ప్రాంగణంలో నిద్రిస్తున్న సమయంలో గ్రామానికి చెందిన హుసేని అక్కడికి చేరుకున్నాడు. అతని స్నేహితులు వినోద్, నూరి ఇంటి పక్కల కాపలాగా ఉండగా బాలికపై హుసేని అత్యాచారానికి యత్నించాడు. బాలిక కేకలు వేయడంతో పక్కన నిద్రిస్తున్న చిన్నారి తాత లేచే సరికి హుసేని, అతని స్నేహితులు పరారయ్యారు. ఈ ఘటన గురించి బాలిక మరుసటి రోజు తల్లిదండ్రులకు తెలపడంతో వారు.. రెండు రోజుల క్రితం స్వగ్రామం చేరుకుని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హుసేనితోపాటు వినోద్, నూరిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. త్వరలోనే నిందితులను అరెస్ట్ చేస్తామన్నారు.

నేటి నుంచి 71వ సహకార వారోత్సవాలు

కర్నూలు(అగ్రికల్చర్): అఖిల భారత 71వ సహకార వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20 వరకు జరుగనున్నాయి. వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర అనే థీమ్‌లో ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లుగా జిల్లా సహకార శాఖ అధికారి రామాంజనేయులు తెలిపారు. 14న సహకార మంత్రిత్వ శాఖ ద్వారా సహకార ఉద్యమాన్ని బలోపేతం చేయడం ఎలా అనే అంశంపై చర్చ ఉంటుందన్నారు. ఇలా 20వ తేదీ వరకు రోజుకో అంశంపై చర్చలు, సమావేశాలు ఉంటాయని అధికారులు తెలిపారు. గురువారం జిల్లా సహకార కేంద్రబ్యాంకులో జరిగే కార్యక్రమంలో అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్, జేసీ నవ్య సహకార పతాకాన్ని ఆవిష్కరించనున్నారు.

హతవిధీ..ఉద్యోగి!

- ప్రభుత్వ ఉద్యోగులకు షాకిచ్చిన చంద్రబాబు సర్కార్
- ఫ్యామిలీ, సర్వీస్ పెన్షన్ పొందాలంటే ఇక చుక్కలే
- ప్రతిపాదనల ఆమోదానికి గడువు పెంచిన కూటమి ప్రభుత్వం
- బెనిఫిట్స్, పెన్షన్ చేతికి దక్కాలంటే ఏడాది పట్టే అవకాశం
- బెంబేలెత్తుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు
- అయినా నోరు మెదపని ఉద్యోగ సంఘాల నాయకులు



➤ కర్నూలు సర్వజన వైద్యశాలలో ఈ ఏడాది జూలై 31న ఓ ల్యాబ్ టెక్నీషియన్, మరో జూనియర్ అసిస్టెంట్ పదవీ విరమణ పొందారు. మూడు నెలలు గడచినా ఇంతవరకు వీరి పెన్షన్ ప్రపోజల్స్ ఆమోదానికి నోచుకోలేదు. ప్రయోజనాలూ అరకొరగానే మంజూరయ్యాయి. తాజాగా కూటమి ప్రభుత్వం పెన్షన్ ప్రతిపాదనలను ఆమోదించే గడువును రెట్టింపు చేయడంతో వీరికి రావాల్సిన ప్రయోజనాలు, పెన్షన్ ఎప్పటికి వస్తుందో అర్థం కాని పరిస్థితి.

➤ నంద్యాల రెవెన్యూ సబ్‌డివిజన్‌లోని ఓ నాలుగో తరగతి ఉద్యోగి మూడు నెలల కిందట పదవీ విరమణ పొందారు. వచ్చే ప్రయోజనాలు, ఇతరత్రా వాటిపై నమ్మకంతో తన కుమార్తెకు వివాహం నిశ్చయం చేశాడు. పెళ్లి రోజు దగ్గర పడుతున్నా ... ప్రపోజల్స్‌కు ఆమోదం లభించకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నాడు. తాజాగా కూటమి ప్రభుత్వం ప్రపోజల్స్ ఆమోదానికి గడువు పెంచడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డాడు.

...ఇలా ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు, మూడు నెలల క్రితం పదవీ విరమణ పొందిన వారంతా పెన్షన్, ఇతరత్రా ప్రయోజనాల కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. కానీ కూటమి ప్రభుత్వం ప్రపోజల్స్ ఆమోదానికి గడువు పెంచడంతో అవి ఎప్పుడు తమకు దక్కేనో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసరంలో ఉన్న వారు అప్పులు చేస్తున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య: 65,000

ప్రతి నెలలో పదవీ విరమణ పొందే ఉద్యోగులు:	సర్వీస్ పెన్షన్ ప్రపోజల్స్‌ను ఆమోదించేందుకు	తాజాగా కూటమి సర్కార్ ఇచ్చిన గడువు:
200 నుంచి 300 మంది	గతంలో గడువు: 45	90 రోజులు

గతంలో ఫ్యామిలీ పెన్షన్ ప్రపోజల్స్ ఆమోదానికి గడువు: 90 రోజులు

తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో ఆమోదానికి గడువు: 6 నెలలు

ఎన్నికల సమయంలో చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు అరచేతిలో స్వర్గం చూపారు. నమ్మి ఓటేసి అధికారం అప్పగించిన తర్వాత తనలోని అసలు రూపాన్ని బయట పెడుతున్నారు. ఇప్పటికే అన్ని వర్గాల ప్రజలు బాధితులుగా మిగిలిపోగా.. ఉద్యోగులు కూడా ఇప్పుడు అందులో చేరిపోయారు. ఇంతవరకు ప్రభుత్వ ఉద్యోగికి ఎలాంటి ప్రయోజనం చేకూర్చని చంద్రబాబు.. సర్వీస్, ఫ్యామిలీ పెన్షన్ మంజూరు చేసే వ్యవధిని సైతం రెట్టింపు చేశారు. ఇప్పటికే ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నించే వారిని అరెస్టులతో బెదిరిస్తుండటంతో...ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు దీనిపై నోరెత్తేందుకు భయపడిపోతున్నారు.

కర్నూలు(అగ్రికల్చర్): పదవీ విరమణ సమీపంలో ఉన్న ఉద్యోగులంతా కుమార్తె వివాహం, కుమారుడి ఉన్నత చదువులు..ఇలా చాలా కీలకమైన నిర్ణయాలన్నీ పదవీ విరమణ తర్వాత అందే ప్రయోజనాలను బేరీజు వేసుకుని ప్లాన్ చేస్తారు. కానీ వారి ప్రణాళికలను కూటమి సర్కార్ కూలదోసింది. పదవీ విరమణ తర్వాత అందే పెన్షన్, ఇతరత్రా ప్రయోజనాల కోసం అందించే ప్రతిపాదనల గడువును పెంచేసింది. సర్కార్ తాజా నిర్ణయంతో ఎవరైనా సరే పదవీ విరమణ పొందితే కనీసం ఏడాది వేచి చూడాల్సిందే.


ప్రపోజల్స్ ఎక్కువగా వస్తున్నాయని...

రాష్ట్రంలో వేలాది మంది టీచర్లు, ఉద్యోగులు పదవీ విరమణ చేశారని, వారి పెన్షన్ ప్రపోజల్స్ అధికంగా విజయవాడలోని అకౌంటెంటు జనరల్(ఏజీ) కార్యాలయానికి వస్తున్నాయన్న సాకుతో ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. సర్వీస్ పెన్షన్‌ల మంజూరు 45 రోజుల నుంచి 90 రోజులు, ఫ్యామిలీ పెన్షన్‌ల మంజూరు 90 రోజుల నుంచి 180 రోజులకు గడువు పెంచినట్లు ఏజీ కార్యాలయం ప్రకటించింది. దీని ప్రకారం గ్రాట్యుటీ, కమిటేషన్, పెన్షన్ పొందడానికి కనీసం ఏడాది సమయం పట్టే అవకాశం ఉంది. జూన్ నుంచి అక్టోబరు వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 1000 మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు పదవీ విరమణ చేశారు. వీరికి సంబంధించిన పెన్షన్ ప్రతిపాదనలు ఒక్కటి కూడా మంజూరు కాలేదు. తాజాగా పెన్షన్ ప్రతిపాదనలు ఆమోదించేందుకే ఆరు నెలలు పడితే అవి ట్రెజరీకి వచ్చి.. అక్కడి నుంచి సబ్ ట్రెజరీకి... అక్కడి నుంచి ఆర్‌బీఐకి వెళ్లాల్సి ఉంటుంది. అప్పుడు కూడా ప్రభుత్వం దగ్గర ఉన్న నిధుల లభ్యతను బట్టి ప్రయోజనాలు లభిస్తాయి.

వారికి తీవ్ర నిరాశే...



ఉద్యోగులు సర్వీస్ పూర్తి చేసుకుని బెనిఫిట్స్‌తో పాటు పెన్షన్ కోసం ప్రపోజల్ పంపాడాన్ని సర్వీస్ పెన్షన్‌గా వ్యవహరిస్తారు. పదవీ విరమణ తర్వాత సంబంధిత శాఖ ద్వారా సర్వీస్ పెన్షన్ ప్రపోజల్స్ ఏజీ కార్యాలయానికి వెళ్తాయి. వైఎస్సార్‌సీపీ పాలనలో సర్వీస్ పెన్షన్ ప్రపోజల్స్‌ను ఆమోదించే ప్రక్రియ కేవలం 45 రోజుల్లోనే జరిగేది. 90 రోజుల్లోపు బెనిఫిట్స్ చేతికి రావడంతో పాటు పెన్షన్ కూడా మంజూరు అయ్యేది. చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం సర్వీస్ పెన్షన్ ప్రపోజల్స్ ఆమోదించే వ్యవధిని 45 రోజుల నుంచి 90 రోజులకు పెంచింది. దీని ప్రకారం పదవీ విరమణ పొందిన వారు బెనిఫిట్స్, పెన్షన్ పొందడానికి 10 నెలల నుంచి ఏడాది సమయం పట్టే అవకాశం ఉంది. ప్రభుత్వ నిర్ణయంతో పదవీ విరమణకు చేరువలో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో ఆందోళన పెరుగుతోంది.



పెన్షన్ ప్రపోజల్స్ ఏజీ కార్యాలయానికే...

ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లతో సహా అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ ప్రపోజల్స్ విజయవాడలోని ఏజీ కార్యాలయానికి వెళ్తాయి. ఉపాధ్యాయులు, నాలుగో తరగతి ఉద్యోగుల పెన్షన్ ప్రపోజల్స్ స్టేట్ ఆడిట్ కార్యాలయానికి చేరుతాయి. ఉద్యోగుల పెన్షన్ ప్రపోజల్స్ 80 శాతం ఏజీ కార్యాలయానికే వెళ్తాయి. అక్కడ ఆమోదించే వ్యవధిని రెట్టింపు చేయడంతో సకాలంలో బెనిఫిట్స్ అందడం కష్టమే. వైఎస్ జగన్ పాలనలో ఫ్యామిలీ, సర్వీస్ పెన్షన్ ప్రతిపాదనలు సకాలంలో అంటే నిర్దేశించిన వ్యవధిలోనే ఆమోదం పొందేవి. దీంతో బెనిఫిట్స్‌తో పాటు పెన్షన్ పొందడంలో ఎలాంటి జాప్యం జరిగేది కాదు.

ఫ్యామిలీ పెన్షన్ మంజూరు ఇక అంత సులభం కాదు

సర్వీస్‌లో ఉన్న ఉద్యోగి ఆకస్మికంగా మరణించినప్పుడు ఉద్యోగి భార్య లేదా భర్త లేదా పిల్లలకు బెనిఫిట్స్‌తో పాటు పెన్షన్ ఇవ్వడాన్ని ఫ్యామిలీ పెన్షన్‌గా వ్యవహరిస్తారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఫ్యామిలీ పెన్షన్ ప్రపోజల్స్‌కు 90 రోజుల్లోపే ఆమోదం లభించేది. గత ప్రభుత్వంలో ఏ ఒక్క ఫ్యామిలీ పెన్షన్ ప్రపోజల్స్ మంజూరు ప్రక్రియ 90 రోజులు దాటలేదు. కానీ కూటమి ప్రభుత్వం ఫ్యామిలీ పెన్షన్ ప్రపోజల్స్ మంజూరు వ్యవధిని 90 రోజుల నుంచి ఏకంగా ఆరు నెలలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల్లో ఆందోళన మొదలైంది.



ప్రతి నెలా 200 నుంచి 300 మంది పదవీ విమరణ

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు దాదాపు 65 వేల మంది ఉన్నారు. వీరిలో ప్రతి నెల 200 నుంచి 300 మంది పదవీ విరమణ చేస్తుంటారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అంటే జూన్ నుంచి అక్టోబరు వరకు కర్నూలు జిల్లాలో 600 మంది, నంద్యాల జిల్లాలో 400 మంది వరకు పదవీ విరమణ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పదవీ విరమణ చేసిన వారిలో ఒక్కరికీ కూడా పదవీ విరమణ ప్రయోజనాలు లభించలేదు. నవంబరు, డిసెంబరు నెలల్లో మరో 400 మంది వరకు పదవీ విరమణ చేయనున్నారు. వీరికి 2026లోనే బెనిఫిట్స్, పెన్షన్ లభించే అవకాశం ఉంది. పెన్షన్ ప్రతిపాదనలను ఆమోదించడానికి గడువును రెట్టింపు చేయడమే ఇందుకు కారణం.

గడువు పెంచడం సరికాదు



ఫ్యామిలీ పెన్షన్, సర్వీస్ పెన్షన్ ప్రతిపాదనలను ఆమోదించేందుకు గడువును రెట్టింపు చేయడం అన్యాయం. దీనివల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడతారు. ఏడాది వరకు ప్రయోజనాలు పొందలేని పరిస్థితి ఏర్పడుతుంది. ప్రపోజల్స్ ఎక్కువగా ఉన్నపుడు సకాలంలో ఆమోదించేందుకు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలి గానీ, ఇలా గడువును పెంచడం సరికాదు. ప్రభుత్వం వెంటనే స్పందించి గతంలో ఉన్నట్లు గానే సర్వీస్ పెన్షన్ ప్రపోజల్స్‌ను 45 రోజుల్లోపు, ఫ్యామిలీ పెన్షన్ ప్రపోజ్స్‌ను 90 రోజుల్లోపు ఆమోదించాలి.

–జి. హృదయరాజు, రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీటీఎఫ్

నేటి నుంచి ఎన్‌సీడీ 3.0 ప్రోగ్రామ్

- జీపీ, షుగర్‌తో పాటు క్యాన్సర్ కేసుల గుర్తింపు
- ఇంటింటికీ తిరిగి పరిశీలించనున్న వైద్య సిబ్బంది



పోస్టర్లు విడుదల చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్. భాస్కర్, అధికారులు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ఈ నెల 14వ తేదీ నుంచి ఎన్‌సీడీ 3.0 క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ప్రారంభించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్. భాస్కర్ చెప్పారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ స్క్రీనింగ్‌లో గ్రామీణ ప్రాంతంలో ఒక ఎంఎల్‌హెచ్‌పీ/సీహెచ్‌ఓ, ఏఎన్‌ఎం, ఆశ, పట్టణ ప్రాంతంలో నర్సులు, ఏఎన్‌ఎం, ఆశా కలిపి ఒక బృందంగా సర్వే నిర్వహిస్తారన్నారు. ఈ స్క్రీనింగ్ కోసం 909 మంది ఆరోగ్య సంరక్షణ సిబ్బందికి శిక్షణ ఇప్పించామన్నారు. స్క్రీనింగ్ వారంలో ఐదు రోజులు (సోమ నుంచి శుక్రవారం) ఉంటుందన్నారు. ప్రతి బృందం రోజుకు ఐదు ఇళ్లను సందర్శిస్తుందని, 18 ఏళ్లపైబడిన వారందరికీ పరీక్షలు చేస్తుందన్నారు. ముఖ్యంగా రొమ్ము, సర్వైకల్ క్యాన్సర్‌తో పాటు బీపీ, షుగర్ స్క్రీనింగ్ చేస్తారన్నారు. ఈ సర్వే ద్వారా ఆరోగ్యం, పరిశుభ్రత ప్రాముఖ్యతను ఆరోగ్య బృందం సభ్యులు ఇంటి వద్దనే అవగాహన కల్పిస్తారన్నారు. అనుమానిత కేసులను పీహెచ్‌సీ/యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వద్దకు పంపిస్తారని తెలిపారు. అక్కడ కూడా నివృత్తి కాని కేసులను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, క్యాన్సర్ ఆసుపత్రికి పంపిస్తారని పేర్కొన్నారు. సమావేశంలో పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

కొత్తపల్లి చెరువుకు కృష్ణా జలాల మళ్లింపుపై సర్వే

కర్నూలు సిటీ: కోడుమూరు మండలంలోని కొత్తపల్లి చెరువుకు హంద్రీనీవా కాలువ నుంచి కృష్ణా జలాలను మళ్లించేందుకు సాధ్యాసాధ్యాలపై జలవనరుల శాఖ ఇంజినీర్లు సర్వే చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం అందుకు సంబంధించిన ప్రక్రియ మొదలు పెట్టారు. కొత్తపల్లి చెరువుకు నీటి లభ్యత లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి తాగు నీటికి సైతం అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్థానిక నాయకులు 2014లో అప్పటి పంచాయతీ రాజ్, ఐటీ శాఖ మంత్రిగా ఉన్న లోకేష్‌కి వినతి పత్రం ఇచ్చారు. అప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు మరోసారి సీఎం చంద్రబాబును కలిసి సమస్యను విన్నవించారు. ఈనేపథ్యంలో సీఎంఓ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు సర్వే చేసి రిపోర్ట్ ఇవ్వనున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. కోడుమూరు, కల్లూరు మండలాల పరిధిలోని హంద్రీ నదిలో ఉపరితల వాగుల నిర్మాణానికి సైతం ప్రాథమిక సర్వే అంచనాలను కోరినట్లు తెలిసింది.

పచ్చమూకల విధ్వంసకాండ

- ఉప్పలపాడు సచివాలయంపై దాడి
- వైఎస్ జగన్ చిత్రంతో కూడిన ఫలకం ధ్వంసం
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



సచివాలయ భవనంపై ఉన్న జగన్ చిత్రంతో కూడిన ఫలకాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

ఓర్వకల్లు: రాష్ట్రంలో కూటమి సర్కార్ కొలువుదీరినప్పటి నుంచీ టీడీపీ నేతల దౌర్జన్యాలకు అంతేలేకుండా పోయింది. వైఎస్సార్ సీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్నారు. ప్రభుత్వ ఆస్తులనూ ధ్వంసం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 11న మండలంలోని ఉప్పలపాడు గ్రామ సచివాలయంపై దాడి చేశారు. సచివాలయంపై ఏర్పాటు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రంతో కూడిన ఫలకాన్ని ధ్వంసం చేశారు. గ్రామానికి చెందిన గొల్ల వెంకటేశ్వర్లు(అలియాస్) బాలమద్దిలేటి, చాకలి పుల్లయ్య, ఇమాంసాహెబ్(అలియాస్) బుడ్డ బాష తదితరులు ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామస్తులు నిలదీయడంతో వారు నేరం ఒప్పుకున్నట్లు వెల్లడించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిందితులను కఠినంగా శిక్షించి, జగన్ చిత్రంతో కూడిన ఫలకాన్ని యథాతథంగా అమర్చాలని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు.

ప్రతిభ భళా..

- వివిధ రంగాల్లో రాణిస్తున్న బాలమేధావులు
- బహుముఖ ప్రజ్ఞతో ఆకట్టుకుంటున్న ప్రియవర్దిని
- కథా రచనా ప్రతిభ చాటుతున్న ఐశ్వర్య
- అబ్బుర పరుస్తున్న సీతామహాలక్ష్మి

నాట్యం.. రచన.. క్రీడలు.. రంగం ఏదైనా కొందరు విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారు. ఓ చిన్నారి వచ్చీరాని మాటలతో వినసొంపుగా భగవద్గీత శ్లోకాలు వినిపిస్తుండగా మరో విద్యార్థిని నాట్యమయూరిని తలపించే నాట్యంతోపాటు శ్రావ్యమైన సంగీతం, అబ్బురపరిచే చిత్రలేఖనంతో బహుముఖ ప్రజ్ఞ కనబరుస్తోంది. ఇంకో విద్యార్థి తన మేధస్సుతో కథా రచనల్లో రాణిస్తోంది. నేడు బాలల దినోత్సవం సందర్భంగా ఆ విద్యార్థులపై ప్రత్యేక కథనం

ప్రియవర్దిని..నాట్యమర్దిని

కర్నూలు కల్చరల్: కూచిపూడి నృత్యం, సంగీతం, కరాటే, చిత్రలేఖనంలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ బహు ముఖ ప్రజ్ఞాశాలిగా ప్రశంసలు అందుకుంటోంది కర్నూలుకు చెందిన ప్రియవర్దిని పాకరాల. ప్రియవర్దినిని ఎనిమిదేళ్ల వయసు నుంచే తల్లిదండ్రులు కె.నరసింహుడు (సివిల్ ఇంజినీర్), కె.శివమ్మ (గృహిణి) నాట్య గురువు నాగసాయి ప్రదీప్ వద్ద కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇప్పించారు. 2014లో ప్రారంభమైనా ఇప్పటికీ కొనసాగుతోంది. కర్నూలులోని ఒక ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఈమె గడిచిన పదేళ్లలో కర్నూలు నగరంతోపాటు శ్రీశైలం, లేపాక్షి, మంత్రాలయం, తిరుచానూరు, విజయవా డ, విశాఖపట్టణం, మంత్రాలయం, అలంపూరు, హైదరాబాదు, కాణిపాకం, కడప, ప్రొద్దుటూరు, శ్రీకాళహస్తి తదితర ప్రాంతాల్లో నృత్య ప్రదర్శనలు ఇచ్చి శభాష్ అనిపించుకుంది. 2016లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదైన సిలికానాంధ్ర వారి కూచిపూడి సమ్మేళనంలో పాల్గొంది. అలాగే తైక్వాండో మార్షల్ ఆర్ట్స్‌లోనూ బ్లాక్ బెల్ట్ పొందింది. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో పలు కంపిటీషన్స్‌లో పాల్గొని విజేతగా నిలిచింది. అబాకస్, సంగీతంలోనూ ప్రతిభ కనబరుస్తోంది. యంగ్‌మూడోలో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి తృతీయ స్థానం కైవసం చేసుకుంది. భవిష్యత్తులో మంచి నృత్య శిక్షకురాలిగా రాణించాలనిదే తన ధ్యేయమని ప్రియవర్దిని చెబుతోంది.



ప్రియవర్దిని నృత్య ప్రదర్శన

ఐశ్వర్య కథకు బహుమతి..



ప్యాపిలి: రాచర్ల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని ఐశ్వర్య కథల పోటీల్లో ప్రతిభ చాటుతోంది. రాచర్ల గ్రామానికి చెందిన భాస్కరయ్య ఆచారి, రమాదేవిల కుమార్తె ఐశ్వర్య గతంలో ఇక్కడ పని చేసిన హెచ్‌ఎం తొగట సురేష్ బాబు ప్రోత్సాహంతో ఎనిమిదో తరగతి నుంచే కథలు రాయడం ప్రారంభించింది. ఇప్పటి వరకు దాదాపు పదుల సంఖ్యలో కథలు రాసింది. వాటిలో 'జలమా..గరళమా' కథను తెలంగాణ రాష్ట్రానికి చెందిన మాచిరాజు బాలసాహిత్య పీఠం నిర్వహించిన కథల పోటీలకు పంపించారు. ఈ కథను బహుమతికి ఎంపిక చేసిన నిర్వాహకులు ఈ నెల మూడో తేదీన హైదరాబాదు రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఐశ్వర్యకు నగదు బహుమతి, పుస్తక బహుమానం, జ్ఞాపికతో సత్కరించారు. మరిన్ని మంచి కథలు రాసి అందరి మన్ననలు పొందడమే తన ధ్యేయమని ఐశ్వర్య తెలిపింది.

ఆరు నిమిషాల్లో 40 శ్లోకాలు



చిన్నారి సీతామహాలక్ష్మి

బేతంచెర్ల: పిట్ట కొంచెం కూత ఘనం అన్నట్లు పట్టణానికి చెందిన నరసింహకుమార్, మహాలక్ష్మి దంపతుల కుమార్తె సీతామహాలక్ష్మి ఈ ఏడాది మార్చిలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించింది. సుమేధా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 1వ తరగతి చదువుతున్న సీతామహాలక్ష్మి భగవద్గీతలోని 40 శ్లోకాలు 5 నిమిషాల 58 సెకండ్లలో ఏకధాటిగా చెప్పి రికార్డు నెలకొల్పింది. దీంతో చిన్నారికి ఇండియా బుక్ రికార్డు ప్రశంసా పత్రం, మెడల్ ప్రదానం చేశారు. రోజూ గంటన్నర సమయం సాధనకు కేటాయించడంతోనే రికార్డు సాధ్యమైందని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు కొంత సమయం కేటాయిస్తే అనుకున్న లక్ష్యం వైపు పయనించడానికి దోహద పడుతుందని సీతామహాలక్ష్మి తల్లిదండ్రులు వెల్లడించారు.



విద్యార్థిని సీతామహాలక్ష్మిని అభినందిస్తున్న దృశ్యం

రోప్ స్కిప్పింగ్‌లో గోల్డ్ మెడల్

హొళగుంద: మండల కేంద్రం హొళగుంద బీసీ కాలనికి చెందిన రాజా మొహమ్మద్ ఫయాజ్ రోప్ స్కిప్పింగ్‌లో తన ప్రతిభను చాటు కుంటున్నాడు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న 13 ఏళ్ల ఫయాజ్ తల్లిదండ్రులు షేక్షావలి, బీబీ కూలీ చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఫయాజ్ గతేడాది చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మేనమామలు చిణిగిసాబ్, సాయిబేష్, షేక్షావలి ప్రోత్సాహంతో 4వ తరగతి నుంచే రోప్ స్కిప్పింగ్‌పై ఆసక్తి పెంచుకుని పోటీల్లో పాల్గొంటున్నట్లు ఫయాజ్ తెలిపాడు.



గతేడాది మదనపల్లిలో గోల్డ్ మెడల్ అందుకుంటున్న రాజా మొహమ్మద్ ఫయాజ్(ఫైల్)